క్లుప్తంగా

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండండి

నారాయణఖేడ్: సైబర్ నేరాలతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి అన్నారు. ఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్‌నేరాలు, షీటీమ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ నేరాలు పెరిగాయన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, హనుమండ్లు, దత్తు, లక్ష్మణ్, పాండు, భూమయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని జానకంపేటకు చెందిన ఎరుకల రాజు(32) ఈ నెల 8న పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామానికి వస్తుండగా రామేశ్వరంబండ దర్గా సమీపంలో బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డాడు. దీంతో రాజు ప్రథమ చికిత్స చేయించుకొని ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో 11వ తేదీన కడుపునొప్పి వస్తోందని చెప్పి సూరారంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతూ 13న రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘కోడ్’ నేపథ్యంలో తీర్మానాలు చేసేందుకు అవకాశంలేదు


మాట్లాడుతున్న ఎంపీపీ మాధవి

కోహీర్(జహీరాబాద్): ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో తీర్మానాలు, నూతన ప్రతిపాదనలు చేయడానికి అవకాశంలేదని ఎంపీపీ మాధవి అన్నారు. కోహీర్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శాన్ని మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఒక్కొక్కరిగా తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ క్రమంలో సభ్యులేవరూ ప్రశ్నించకపోవడంతో సమావేశం సాదాసీదాగా అరగంటలోపే ముగిసింది. సమావేశంలో ఎంపీడీఓ సుజాతనాయక్, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ జీనత్‌ఖాను, ఎంపీటీసీలు మల్లన్నపటేల్, అనితసంపత్‌కుమార్, అనిల్‌కుమార్, జ్ఞానరత్నం, భీమ్‌సింగ్, సర్పంచ్ సంగారెడ్డి, ఏపీఎం సమ్మయ్య, ఏపీఓ సునందరావు, వైద్యాఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం క్విజ్, ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - సంగారెడ్డి న్యూస్ డెస్క్


వట్‌పల్లి(అందోల్): ఉసిరికపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు


జిన్నారం: విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ అధికారి హనుమంతరావు


న్యాల్‌కల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు


ఝరాసంగం(జహీరాబాద్): బాలల దినోత్సవ వేడుకల్లో చిన్నారులు


రామచంద్రాపురం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న క్లాస్మేట్ క్లబ్ సభ్యులు


సదాశివపేట పట్టణంలోని సెయింట్ అంథోని పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు


హత్నూర: కేజీబీవీలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పెషల్ ఆఫీసర్ జయలక్ష్మి

బీఆర్ఎస్, బీజేపీ హామీలు నమ్మొద్దు

- ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం
- స్థానికులకే ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు
- బీఆర్ఎస్‌తోనే జహీరాబాద్ వెనుకబాటు
- కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్


జహీరాబాద్ పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్

జహీరాబాద్: బీఆర్ఎస్, బీజేపీ హామీలు నమ్మొద్దని కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని మూసానగర్ కాలనీ, శాంతినగర్ కాలనీల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గం గజ్వేల్‌లాగా అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తామని తెలిపారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్న కంపెనీల్లో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని హామీనిచ్చారు. జహీరాబాద్ ప్రాంత నిధులు సిద్దిపేటకు తరలివెళ్లడంతోనే జహీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేకపోయిందని వివరించారు. కాంగ్రెస్ నాయకులు ఎంజీ.రాములు, ఎండీ.ఖాజా, అశోక్, జమీలుద్దీన్, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


మూసానగర్ కాలనీలో ముస్లింలతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

నాయీబ్రాహ్మణ యువతకు రుణ సదుపాయం కల్పిస్తాం

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నాయీబ్రాహ్మణ యువతకు రుణ సదుపాయం కల్పిస్తామని కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ అన్నారు. నాయీబ్రాహ్మణ యువకులతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ యూత్ నాయకులు బస్వరాజ్, శ్రీనివాస్, విఠల్, మమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.


యువకులతో సమావేశమైన కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్

కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందే

- పేదల పక్షపాతి బీఆర్ఎస్
- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు


ధనాసిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు

జహీరాబాద్: కాంగ్రెస్, బీజేపీలు దొందు దొందే అని బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు ఎద్దేవా చేశారు. మొగుడంపల్లి మండల పరిధిలోని ధనాసిరి, మాడ్గి గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయనివిధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధిలో ముందంజలో నిలిపారని కొనియాడారు. కాంగ్రెస్, బీజేపీల హామీలను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ ఎండి తన్వీర్, జెడ్పీటీసీ అరుణవిజయ్‌మోహన్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్, టెలికాం బోర్డు సభ్యుడు శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, కుత్బుద్దీన్, విజయ్‌కుమార్, చిరంజీవి ప్రసాద్, నారాయణ, సురేష్, షకీల్, హబ్సీరాజు, ఓంకార్‌రెడ్డి, రాజు, వీరేష్, శాను, మల్లికార్జున్, అనిల్, రాజ్‌కుమార్, మచ్చేందర్, మసూర్‌పటేల్, ఇస్మాయిల్, ఇబ్రహీం, నయామత్‌ఖాన్, శివానంద్, అర్జున్, తుక్కప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

మొగుడంపల్లి మండలంలోని ధనాసిరి, మాడ్గి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో చేరినవారిలో నాయకులు అయ్యప్ప, రాజు, మహేష్, శన్నోజీ, శ్రీకాంత్, పెంటు, నాగప్ప, చంద్రు, మారుతి, ఏళ్లప్ప, శ్రీనివాస్, గౌస్‌పటేల్ ఉన్నారు.


మాణిక్‌ప్రభు వీధిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు సతీమణి మధులత


ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాణిక్‌రావు

ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి మధులత

జహీరాబాద్ టౌన్: బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు భార్య మధులత జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు వీధిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మేనిఫెస్టోలోని హామీలను వివరించారు. ఆమె వెంట నాయకులు బరూర్ దత్తాత్రి, రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, జావిద్, అనుషమ్మ, షీలారమేష్, మంజుల, పుణ్యమ్మ, పద్మమ్మ, పద్మజ తదితరులు ఉన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- మృతదేహాలతో మూడుగంటలపాటు గ్రామస్తుల రాస్తారోకో
- అల్లాదుర్గంలో ఘటన



సాయికుమార్, విజయ్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ స్టేజీ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం మండల పరిధిలోని సీతానగర్ గ్రామానికి చెందిన చిన్నోళ్ల సాయికుమార్ (13), విజయ్ (16), అజయ్ ముగ్గురూ ఒకే బైక్‌పై రాంపూర్ బ్రిడ్జి కింద నుంచి సొంత గ్రామానికి వెళ్తున్నారు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి బాన్సువాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రాంపూర్ స్టేజీ వద్ద విద్యార్థుల బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్, విజయ్ అక్కడికక్కడే మృతి చెందగా, అజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హైవే అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ పెద్దశంకరంపేట ప్రభుత్వ పాఠశాలలో 9 తరగతి చదువుతుండగా, విజయ్ పెద్దశంకరంపేట మోడల్ స్కూల్‌లో 10 తరగతి చదువుతున్నారు. బస్సు డ్రైవర్ వేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు.

బస్సు అద్దాలు ధ్వంసం

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులు మృతి చెందడంతో ఆగ్రహించిన స్థానికులు, మృతుల బంధువులు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును పూర్తిగా ధ్వంసం చేశారు. 161 హైవేకి చెందిన మరో వాహనాన్ని సైతం ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ఘటన స్థలంలో వీడియో తీస్తున్న సీఐ కార్యాలయం రైటర్ ఫోన్‌ను లాక్కొని పగులగొట్టారు. రాంపూర్ వద్ద 161 జాతీయ రహదారిపై గంటపాటు వాహనాలను నిలిపివేసి ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారినా మూడు గంటలపాటు పోలీసులు రాకపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని తెలుసుకున్నారు. రెండు గంటలపాటు ఆయన ఘటనా స్థలంలోనే ఉన్నారు. అనంతరం పోలీసులు వచ్చి ఈ ఘటనపై కేసు నమోదు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని తెలిపారు. బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

తారా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైఫ్ సైన్సెస్ విద్యార్థులు మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగి కళాశాలకు రోల్ మోడల్స్‌గా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత విభాగాల అధ్యాపక బృందం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

పుల్‌కల్(అందోల్): రాబోయే ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని పలువురు నాయకులను మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. జోగిపేట బైండోవర్ చేసినవారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, పుల్‌కల్ ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, మిన్‌పూర్ ఎంపీటీసీ దుర్గయ్య, సూరెడ్డి ఇటిక్యాల సర్పంచ్ రాదయ్య, ప్యాక్స్ డైరెక్టర్ మహేశ్‌బాబు ఉన్నారు.

15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 15మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 15మందిని అదుపులోకి తీసుకొని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

మూకుమ్మడి రాజీనామా

నర్సాపూర్: తనతోపాటు చాలా మంది పార్టీ నాయకులు మూకుమ్మడిగా బీజేపీకి రాజీనామా చేస్తున్నామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని 138 మంది బూత్ కమిటీల అధ్యక్షులు, శివ్వంపేట పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, నర్సాపూర్ మండల మాజీ అధ్యక్షుడు మాణయ్య, కౌన్సిలర్ సునీతా, మండల రూరల్ పార్టీ ఇన్‌చార్జి బాల్‌రెడ్డి, ఎనిమిది మంది వార్డు మెంబర్లు రాజీనామా చేసి తమ రాజీనామా పత్రాలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపుతున్నామని పేర్కొన్నారు. వెల్దుర్తి మండలానికి చెందిన ఎంపీటీసీ నర్సింలు, మరో మండల పార్టీ అధ్యక్షుడితోపాటు మరి కొందరు నాయకులు త్వరలో పార్టీకి రాజీనామా చేస్తారని వివరించారు. కుల రాజకీయాలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. సమావేశంలో శివ్వంపేట పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, బాల్‌రెడ్డి, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం.. సంక్షేమ పథకాలు

- అన్నివర్గాల అభ్యున్నతికి కృషి
- ప్రతి గడపకు మేనిఫెస్టోను చేర్చాలి
- కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టండి
- బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి పిలుపు


నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఆ పార్టీ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో యువత, విద్యార్థి, సోషల్ మీడియా విభాగాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కార్యకర్త గడపగడపకు వెళ్లి అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రతిపక్షాలు చేసే అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేషన్ చైర్మన్లు జగన్మోహన్‌రావు, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సపనదేవ్, శంకర్‌యాదవ్, వివిధ విభాగాల ప్రతినిధులు మెరాజ్‌ఖాన్, గూడెం సంతోష్‌రెడ్డి, చెన్నారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణకాంత్, సందీప్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి..

బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామం పీఎస్ఆర్ కాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశామన్నారు. ఆచరణకు నోచుకోని హామీలను గుప్పిస్తూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ నర్సింహులు, ఉపసర్పంచ్ శివకుమార్‌గౌడ్, నాయకులు బండి శంకర్, రాఘవేంద్రారెడ్డి, శివారెడ్డి, నరసింహారెడ్డి, మాణిక్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు మురళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల మద్దతు..

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు అందిస్తున్నామని పటాన్‌చెరు మున్నూరు కాపు సంక్షేమ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ప్రకటించారు. పట్టణంలోని మున్నూరు కాపు సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైన మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్నూరు కాపుల సంక్షేమానికి అండగా నిలుస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, సపానాదేవ్, అఫ్జల్, కౌన్సిలర్ కృష్ణ, సంఘం అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సత్యనారాయణ, ప్రతినిధులు సీతయ్య, బుచ్చయ్య, శ్రీనివాస్, భాషికి రాజు, అశోక్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం..

పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని చైతన్య బస్తీలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు శంకర్, బాబుల్ రెడ్డి ముత్యాలు పాల్గొన్నారు.


ఇంద్రేశంలో నిర్వహించిన ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థికి బొట్టు పెడుతున్న మహిళ

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో బీజేపీ సీనియర్ నాయకులు సురేందర్, వంశీ ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకులు అన్వర్‌ఖాన్, పాషా, మాజీ రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మల్లెపల్లి సోమిరెడ్డి, కౌన్సిలర్లు లచ్చిరాంనాయక్, బాలాజీ, స్థానిక నేతలు పాల్గొన్నారు.


తెల్లాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మహిపాల్‌రెడ్డికి మద్దతుగా ..

రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం ప్రజాప్రతినిధులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామచంద్రాపురం పట్టణంలో కార్పొరేటర్ పుష్పనగేష్, భారతినగర్ డివిజన్‌లో కార్పొరేటర్స్ సింధుఆదర్శ్‌రెడ్డి, తెల్లాపూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ లలతాసోమిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


పటాన్‌చెరు డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్, నాయకులు


విద్యుత్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహిస్తున్న మహిపాల్‌రెడ్డి